

'గిరి' చెరిగేనా?



రౌతులపూడి మండలంలోని ఓ సబ్‌ప్లాన్ గ్రామం

- జిల్లాలో సబ్‌ప్లాన్ ఏజెన్సీ మండలాల గిరిజనుల కష్టాలు ఇకనైనా తీరేనా
- కొత్త ప్రభుత్వం రావడంతో తమకు గుర్తింపు లభిస్తుందని ఎదురుచూపులు
- గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో గిరిజనుల కష్టాలకు లభించని మోక్షం
- ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు ప్రతిపాదనలు అందినా చెత్తబుట్టలో పడేసిన వైనం
- అప్పటి ప్రభుత్వంపై కనీస ఒత్తిడి కూడా చేయని నాటి మంత్రి, స్థానిక ఎమ్మెల్యేలు
- జిల్లాల విభజనతో అల్లూరి జిల్లాకే పరిమితమైపోయిన రంపచోడవరం ఐటీడీఏ
- అప్పటి నుంచి జిల్లా సబ్‌ప్లాన్ ఏజెన్సీలోని 28 వేల మంది గిరిజనులకు ఐటీడీఏ నిల్
- మైదాన ప్రాంతం పరిధిలోకి వచ్చేయడంతో షెడ్యూల్ ఏరియా గుర్తింపు మాయం
- తమ గుర్తింపు కోసం ఆదివాసీలు పోరాటాలు చేసినా పట్టించుకోని జగన్ ప్రభుత్వం
- ఇప్పుడు కొత్త సర్కారు రావడంతో న్యాయం చేయాలని కోరుతున్న ఆదివాసీలు

జిల్లాలో సబ్‌ప్లాన్ ఏజెన్సీలోని ఆదివాసీల కష్టాలకు ముగింపు లభించడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం వీరి బాగోగులను పూర్తిగా గాలికి వదిలేసి ఐటీడీఏ అనుమతి ఇవ్వలేదు. జిల్లా నుంచి ప్రతిపాదనలు వెళ్లినా కనీసం పరిశీలించకుండా చెత్తబుట్టలో పడేసింది. దీంతో కొన్నేళ్లుగా జిల్లాలో గిరిజనులు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీకావు. ప్రస్తుతం కొత్తగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమకు న్యాయం చేయాలని ఆదివాసీలు గోస పెడుతున్నారు. తమను గుర్తించి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. జగన్ ప్రభుత్వంలో తమకు సంక్షేమం అందిస్తామని మోసం చేసిన వైనాన్ని గుర్తుచేసుకుంటూ ఇప్పుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాల విభజనతో తీవ్రంగా నష్టపోయిన తమను వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రి పూర్తిగా పట్టించుకోవడం మానేయడంపై ఇప్పటికీ రగిలిపోతున్నారు. కొత్త ప్రభుత్వమైనా తమ బాగోగులు పట్టించుకుని ఐటీడీఏ లేదా దానికి సమాన సంక్షేమం అందించాలని 59 గ్రామాల్లోని 28 వేల ఆదివాసీలు వేడుకుంటున్నారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వం 2022లో జిల్లాల విభజన ప్రక్రియ చేపట్టింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను నాలుగు జిల్లాలుగా విడదీసింది. దీంతో రంపచోడవరం ఐటీడీఏ ఉమ్మడి తూర్పుగోదావరి నుంచి విడిపోయి కొత్తగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో కలిసింది. ఫలితంగా కాకినాడ జిల్లాలోని తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల పరిధిలోని 59 సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాల సరిహద్దు మారిపోయింది. అప్పటివరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఐటీడీఏ పరిధిలో ఉన్న ఈ గ్రామాలు ఆ తర్వాత కాకినాడ జిల్లా పరిధిలోకి వచ్చాయి. రంపచోడవరం ఐటీడీఏ అల్లూరి జిల్లాలోకి వెళ్లిపోవడంతో కాకినాడ జిల్లాకు ఐటీడీఏ లేకుండా పోయింది. దీంతో ఎన్నో ఏళ్లుగా రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజనులు జిల్లాల విభజనతో ఐటీడీఏ కోల్పోయారు. ఐటీడీఏ వేరే జిల్లాలోకి వెళ్లిపోవడంతో, అందులోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ మండలాలు కాకినాడ జిల్లాలో ఉండిపోయాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రత్తిపాడు, జగ్గంపేట, తుని నియోజకవర్గాల పరిధిలోని పది మండలాల పరిధిలో గల 59 గ్రామాల్లో 28 వేల మంది గిరిజనులు ఐటీడీఏ కోల్పోయారు. జిల్లా మారిపోవడంతో ఈ గిరిజనులతో ఇకపై తమకు సంబంధం లేదని రంపచోడవరం ఐటీడీఏ 2022 ఏడాది చివర్లో చేతులు దులిపేసుకుంది. 59 సబ్‌ప్లాన్ గ్రామాల్లో మౌలికసదుపాయాలు, సమస్యలు, గిరిజనుల ఉద్యోగాల రిజర్వేషన్ ఏదీ తమకు సంబంధం లేదని అప్పట్లో అధికారులు తేల్చేశారు. ఫలితంగా ఏ సమస్య వచ్చినా తమను అప్పటి నుంచి ఎవరూ పట్టించుకోకపోవడంతో జిల్లా పరిధిలోని గిరిజనులు ఆందోళనలు చేస్తున్నారు. వాస్తవానికి ఇంతకుముందు ఈ గ్రామాలన్నీ ఎన్నో ఏళ్లుగా రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ మండలాలుగా కొనసాగేవి. ఫలితంగా వీరందరి బాగోగులు ఐటీడీఏ చూసేది. విద్య, వైద్యం, రహదారుల సౌకర్యం మొదలు తాగునీటి వసతి, వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి, ప్రభుత్వ ఉద్యోగాల రిజర్వేషన్ వరకు అన్నీ వర్తింపజేసేది. తీరా 2022 నుంచి ఐటీడీఏ పరిధి కోల్పోవడంతో 59 గ్రామాల్లోని గిరిజనులంతా మైదాన ప్రాంత గిరిజనులుగా మారిపోయారు. తద్వారా షెడ్యూల్ తెగల ఏరియా హోదా సహా గిరిజనుల కోటా కింద వచ్చే ప్రయోజనాలన్నీ పోయాయి. ఈనేపథ్యంలో 28వేల మంది గిరిజనులు తమను కాకినాడ జిల్లా నుంచి తప్పించి అల్లూరి జిల్లాలో కలపాలని అప్పటినుంచీ డిమాండ్ చేస్తున్నారు. గ్రామసభల్లో తీర్మానాలు చేసి అప్పటి కలెక్టర్‌కు కూడా పంపించారు. అలాగే 59 గ్రామాల పరిధిలోని అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు సైతం వీరి న్యాయపరమైన డిమాండ్ కోసం ఆందోళకు మద్దతు ఇచ్చారు. షెడ్యూల్ ఏరియాగా గుర్తించాలంటూ జిల్లా పరిషత్‌లో తీర్మానించారు. ఈ నేపథ్యంలో షెడ్యూల్ ఏరియాగా గుర్తించాలా? లేదా? అనే దానిపై రంపచోడవరం ఐటీడీఏ పీవో నుంచి అప్పటి కాకినాడ కలెక్టర్ నివేదిక కోరారు. దీనిపై అధ్యయనం చేసిన ఐటీడీఏ అధికారులు 2023లో నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. 59 గ్రామాల్లో 56 గ్రామాలనే గిరిజన ప్రాంతాలుగా గుర్తించొచ్చని సిఫార్సు చేశారు. వీరంతా గిరిజనులే కాబట్టి ఐటీడీఏ విడిపోవడంతో వీరు నివసిస్తోన్న గ్రామాలను గిరిజన తెగ గ్రామాలుగా ప్రకటించాలని నివేదికలో పేర్కొన్నారు. అయితే వీరికి ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేయడమా? లేదా షెడ్యూల్ ఏరియాగా గుర్తించి ఐటీడీఏ లేకుండా పథకాలు అమలు చేయడమా? అనేదానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని నివేదికలో ప్రస్తావించారు. అలాగే జిల్లాలో మండలాల వారీగా ఏయే గ్రామంలో ఎంతమంది ఆదివాసీలు ఉన్నారో జనాభా లెక్కలు కూడా నివేదికలో పొందుపరిచారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఉన్నప్పుడు 56 గ్రామాలకు చేసిన ఖర్చు.. గ్రామాల్లో సామాజికవర్గాల వారీగా జనాభా తదితర విశ్లేషణలు కూడా క్రోడీకరించారు. జిల్లాలో 56 గ్రామాలను గిరిజన ప్రాంతాలుగా గుర్తించడానికి రంపచోడవరం ఐటీడీఏ అభ్యంతరం లేదని నివేదిక పంపిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ నుంచి కూడా సిఫార్సులతో కూడిన నివేదిక గతేడాది రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్లింది. ఈనివేదిక కూడా గిరిజ నులకు అనుకూలంగానే ఉంది. జిల్లా గిరిజన సంక్షేమశాఖ సైతం ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేయాలని నివేదిక పంపింది.

చెత్తబుట్టలో పడేశారంతే..

నివేదికలు రాష్ట్ర ప్రభుత్వానికి అందినా అప్పటి జగన్ సర్కారు కనీసం పట్టించుకోలేదు. ప్రత్యేక ఐటీడీఏకు ఆమోదం తెలపడం, లేదా.. సబ్‌ప్లాన్ ఏజెన్సీ మండలాలను ప్రత్యేక గిరిజన ప్రాంతంగా నోటిఫై చేసి ప్రత్యేక అధికారిని నియమించడం అనేదానిపై ఏదీ తేల్చకుండా చెత్తబుట్టలో పడేసింది. జిల్లా నుంచి అమరావతికి వెళ్లిన నివేదికలను రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ప్రభుత్వ పరిశీలనకు పంపితే వాటన్నింటిని అప్పటి సర్కారు మూలన పడేసింది. అప్పటి జిల్లా మంత్రి దాడిశెట్టి రాజా, సంబంధిత సబ్‌ప్లాన్ ఏజెన్సీ మండలాల పరిధిలోని ఎమ్మెల్యేలు కూడా ప్రభుత్వంపై కనీసం ఒత్తిడి తేలేదు. దీంతో రాష్ట్రప్రభుత్వం అసలు దీన్ని ఓ సమస్యగా భావించలేదు. అప్పటి మంత్రి, జిల్లా ఎమ్మెల్యేలు చొరవ తీసుకుని ఈ సమస్యను మంత్రివర్గ సమావేశంలో చర్చకు వచ్చేలా చేసి ప్రభుత్వం నిర్ణయం తీసుకునేలా ప్రయత్నాలు చేస్తే ఫలించే అవకాశం ఉన్నా ఆ దిశగా ప్రయత్నం కూడా జరగడం లేదు. దీంతో సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాలకు ఐటీడీఏ ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. అయితే ఇప్పుడు కొత్తగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమకు న్యాయం చేయాలని గిరిజనులు కోరుతున్నారు. గత ప్రభుత్వం నిలువునా మోసంచేసిన నేపథ్యంలో సీఎం చంద్రబాబు తమ గోడును పట్టించుకోవాలని కోరుతున్నారు. ఈ సమస్యపై ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ దృష్టిసారించడంతో గిరిజనుల్లో కొంత ఆశ నెలకొంది. సత్యప్రభ ఇప్పటికే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో ఆశలు చిగురిస్తున్నాయి. అయితే ప్రభుత్వం కాలయాపన చేయకుండా ఐటీడీఏ ప్రకటించడమా లేదా దానికి సమాన ప్రతిఫలం కల్పించాలని కోరుతున్నారు.



ఆగస్టు ఒకటి.. వస్తోంది!

- ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సన్నాహాలు
- జిల్లాలో 2,77,587 మందికి రూ.116 కోట్లు
- సచివాలయ సిబ్బందితో లబ్ధిదారు ఇంటికే పింఛన్లు

కలెక్టరేట్ (కాకినాడ), జూలై27: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధంచేశారు. ఆగస్టు ఒకటో తేదీన నూరు శాతం పంపిణీ చేయాలని ప్రణాళికలు రూపొందించారు. జిల్లా వ్యాప్తంగా 2,77,587 మంది లబ్ధిదారులకు రూ.116 కోట్ల 76లక్షలు ప్రభుత్వం కేటాయించింది. దీంతో వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, డప్పు కార్మికులు, చేనేత కార్మికులు వంటి లబ్ధిదారులందరికీ అదేరోజు అందజేస్తారు. గత నెల కూటమి ప్రభుత్వం పింఛన్ల పంపిణీకి పెద్ద పండుగలా నిర్వహించింది. పెంచిన పింఛన్లకు తోడు మూడు నెలల అదనపు మొత్తంతో కలిపి ఏకంగా రూ.7 వేలు అందజేసింది. అదేవిధంగా దివ్యాంగులకు మూడు వేల నుంచి ఏకంగా రూ.6 వేలు అందించింది. దీంతో ఆయా వర్గాల్లో ఆనందానికి హద్దుల్లేకుండాపోయింది. ఈనెల అన్ని వర్గాల వారికి పింఛను కింద రూ.4 వేలు అందజేస్తారు. దివ్యాంగులకు ఇక ప్రతినెల రూ.6 వేలు అందజేస్తారు. ఈవిధంగా అందజేసేందుకు జిల్లాలో అత్యధికంగా కాకినాడ అర్బన్ మండలంలో 30,303 మంది లబ్ధిదారులకు రూ.12.82 కోట్లు కేటాయించారు. జగ్గంపేట మండలంలో 12,208 మంది లబ్ధిదారులకు రూ.5.23 కోట్లు, కాజులూరు మండలంలో 10,137 మందికి రూ.4.19 కోట్లు కేటాయించారు. అలాగే కాకినాడ రూరల్ మండలంలో 18,294 మంది లబ్ధిదారులకు రూ.7.65 కోట్లు, ప్రత్తిపాడు మండలంలో 11,786 మందికి రూ.4.98 కోట్ల నిధులు సిద్ధం చేశారు. అలాగే తాళ్లరేవు మండలానికి 11,582 మంది లబ్ధిదారులకు రూ.4.84 కోట్లు, తొండంగి మండలానికి 12,638 మందికి రూ.5.34 కోట్లు, తునికి 12,345 మందికి రూ.5.27 కోట్లు కేటాయించారు. జిల్లాలో ఇతర మండలాలకు కూడా లబ్ధిదారుల సంఖ్యను అనుసరించి నిధులు సిద్ధం చేశారు. గత నెల మాదిరిగానే సచివాలయ సిబ్బందితోనే లబ్ధిదారుల ఇంటికే ఈ పింఛన్లను తీసుకెళ్లి అందజేస్తారు. ఒకేరోజు పింఛన్లు అందరికీ అందజేసేవిధంగా అధికారులు చర్యలు చేపట్టారు. కాగా ఈనెల ఒకటో తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సమయంలో జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల్లో ఉదయం సమయంలో సర్వర్లు మొరాయించాయి. దీనివల్ల పింఛన్ల పంపిణీలో కొద్దిగా జాప్యం జరిగింది. అలాంటి పరిస్థితి ఉత్పన్నం కాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

కొత్త దరఖాస్తుదారుల ఆశలు

జిల్లాలో ఇటీవల ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కోసం 150 మంది దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టరేట్‌లో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వ్యవస్థతోపాటు జిల్లాలో ఇతర మండలాల్లో అధికారులకు అర్జీలు సమర్పించారు. దీంతో ఈ దరఖాస్తుదారులు పింఛన్ల మంజూరు కోసం కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. తమకు పింఛను మంజూరు చేస్తారనే అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తున్నారు. అయితే ఇంకా అధికారికంగా మంజూరుపై ఎలాంటి ఆదేశాలు రాలేదు.

కదలరు.. వదలరు!

- వీళ్లది సెపరేట్ 'పంచాయితీ'
- ఏళ్ల తరబడి పాతుకుపోవడమే కారణం
- ఉన్నతాధికార్లతో పనిలేదు, అంతా తామేనంటారు
- కింది స్థాయి ఉద్యోగులకు నిత్యసంకటం

కార్పొరేషన్ (కాకినాడ), జూలై27: సాధారణంగా ఉన్నతాధికారులంటే ఉద్యోగులంతా హడలిపోతారు. కానీ ఇక్కడ పరిస్థితి వేరు. ఇక్కడ అంతా తామే అన్నట్టు ద్వితీయ శ్రేణి అధికారులు కొందరు చక్రంతిప్పుతారు. కింద స్థాయి ఉద్యోగులకూ వీరంటేనే దడ. కాకినాడ జిల్లా పంచాయతీ, డివిజనల్ పంచాయతీ కార్యాలయాల్లో దాదాపు ఇదే పరిస్థితి కనిపిస్తోంది. డీపీవో కార్యాలయంలో ఇద్దరు ద్వితీయ శ్రేణి అధికారులు, డీఎల్‌పీవో ఆఫీసులో ఒక ద్వితీయ శ్రేణి అధికారి ఏళ్ల తరబడి పాతుకుపోయారు. అధికారంలో ఏ ప్రభుత్వమున్నా తమదే పెత్తనం అన్నట్టు వీరు వ్యవహరిస్తున్నారు. గత ప్రభుత్వకాలంలో వీరిదే హవా నడవగా, ఇప్పుడూ వారే చక్రం తిప్పుతున్న పరిస్థితి ఉంది. జిల్లా పంచాయతీ కార్యాలయం విషయానికి వస్తే ఇక్కడ దీర్ఘకాలికంగా పాతుకుపోయిన ఇద్దరు ద్వితీయ శ్రేణి అధికారులు ఎక్కడ పోస్టింగ్ ఇచ్చినా వారి పరపతి, పైరవీలు ఉపయోగించి కొద్దికాలానికే తిరిగి ఇక్కడికే వచ్చేస్తారు. జిల్లాలో పంచాయతీరాజ్ విభాగంలో పనిచేసే కింది స్థాయి ఉద్యోగులపై అజమాయిషీ చెలాయిస్తారు. ఇక వసూళ్ల పర్వం సరేసరి. ఇటీవల పంచాయతీ కార్యదర్శులకు ఇంక్రిమెంట్లు వచ్చాయి. ఒక్కో కార్యదర్శి నుంచి అధికారులకు ఇవ్వాలంటూ వీరు రూ.3500 వసూలు చేసినట్టు విశ్వసనీయ సమాచారం. అంతకంటే ముందు కార్యదర్శుల ప్రమోషన్ ఫైల్ మూవ్ చేయడానికి ఒక్కో కార్యదర్శి నుంచి కనీసం వెయ్యి తీసుకున్నట్టు సమాచారం. ఉన్నతాధికారుల టూర్ డైరీల పేరిట కూడా వీరే రహస్య వసూళ్లు చేస్తారు. పంచాయతీ ఆదాయాన్ని బట్టి వీరే రేటు నిర్ణయిస్తారనే ఆరోపణలున్నాయి. ఎవరైనా పంచాయతీ కార్యదర్శి సహకరించకపోతే వారిపై ఫిర్యాదు చేయించే వ్యూహాన్ని కూడా వీరే అమలు చేస్తారంటూ కొందరు కార్యదర్శులు వాపోతున్నారు. విచారణ పేరుతో వారి చుట్టానే తాము కాళ్లరిగేలా తిరగాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఈ విషయాలను ఉన్నత స్థాయి అధికారులు, ఇతర సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలంటే కింది స్థాయి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు భయపడతారు. ఎక్కడ తమ పేర్లు బయటపడితే ఇబ్బంది వస్తుందోనని హడలిపోతున్నారు. సుదీర్ఘకాలంగా ఇదే కార్యాలయాల్లో పాతుకుపోయిన అధికారులపై చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు. ఇక కాకినాడ డీఎల్‌పీవో కార్యాలయంలో గతంలో ఒక ద్వితీయ శ్రేణి అధికారి ఎన్నో అక్రమాలకు పాల్పడుతుండేవారు. ఈయనపై ఏసీబీ కన్ను పడిందనే విషయం గ్రహించడంతో కొంతమంది సలహా మేరకు బదిలీపై వెళ్లిపోయారు. అక్కడ కూడా ఇదే తీరున నడుచుకోవడంతో అక్కడి నుంచి ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి పైరవీలు మొదలుపెట్టి అప్పటి ఒక ఎమ్మెల్యే సహకారంతో కాకినాడ పోస్టింగ్ వేయించుకున్నారు. దీంతో ఆయన ఆగడాలు మళ్లీ మొదలయ్యాయని, ఇలా అదే కార్యాలయాల్లో దీర్ఘకాలంలో పనిచేస్తున్న అధికారులపై దృష్టి పెట్టాల్సి ఉందని ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.



జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నిరసన తెలుపుతున్న ప్రజాప్రతినిధులు

ప్రజాభిప్రాయ సేకరణ బహిష్కరణ

- కోస్టల్ జోన్ మ్యాపింగ్‌పై విస్తృత ప్రచారం చేయలేదని నిరసన
- జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో కార్యక్రమం వాయిదా

కలెక్టరేట్ (కాకినాడ), జూలై27: సముద్రతీర ప్రాంతంలో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ పరిధిలో కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ మ్యాపింగ్ చేసే లక్ష్యంతో అధికారులు శనివారం కాకినాడ కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ మందిరంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభించారు. అయితే తమ గ్రామాల్లో కోస్టల్ జోన్ మ్యాపింగ్‌పై అవగాహన కల్పించలేదని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, పర్యావరణవేత్తలు అధికారులను నిలదీశారు. కరపత్రాల పంపిణీ, చాటింపు నిర్వహించలేదని ఆగ్రహం వ్యక్తంచేసి కార్యక్రమాన్ని బహిష్కరించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ సంఘం గౌరవ అధ్యక్షుడు చెంగళరావు మాట్లాడుతూ కోస్టల్ జోన్ మ్యాపింగ్‌పై తొలుత తీర ప్రాంత వాసులకు సరైన అవగాహన కల్పించాలన్నారు. కరపత్రాలు పంపిణీ చేయకుండా, ముందస్తు సమాచారం ఇవ్వకుండా జోన్‌పై ప్రజాభిప్రాయ సేకరణ ఎలా చేస్తారని ప్రశ్నించారు. కోస్టల్ జోన్ వలన తీరప్రాంతంలో ఉన్న మత్స్యకారులకు ఎలాంటి నష్టం కల్గకుండా ఉండాలన్నారు. అలాగే పర్యావరణానికి కూడా ఎలాంటి హాని జరగకూడదన్నారు. కోస్టల్ జోన్ రెగ్యులేషన్ చట్టం 2019 అమలుకు అన్ని విధానాలను పాటించాలన్నారు. అనంతరం ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ దృష్టికి తీసుకెళ్లడంతో ప్రస్తుతానికి ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేశారు. కార్యక్రమంలో యూ.కొత్తపల్లి మండలం, తొండంగి మండలం, తాళ్లరేవు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు కొయ్యా కేశవ్, పేకేటి యతిమాని, ధారకొండ, రమణ, చొక్కా కాశీరావు, అప్పారావు, చంద్రరావు, సింహాచలం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు ఇతర నాయకులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), జూలై27: ప్రజాసమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టి వాటి పరిష్కారానికి కృషిచేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదులపై జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని శనివారం జేసీ రామ్‌సుందర్‌రెడ్డి, కాకినాడ కమిషనర్ భావనలతో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అందిన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలన్నారు. ప్రతి సోమవారం అందిన అర్జీలను ఆయా శాఖల అధికారులు శాశ్వతంగా పరిష్కరించాలన్నారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటుచేశామన్నారు. టాస్క్‌ఫోర్స్ సమావేశం ప్రతి శనివారం నిర్వహిస్తామని, ఇందులో ప్రతి ఒక్క ఫిర్యాదును పరిశీలించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా రెవెన్యూ, పింఛన్ల మంజూరు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూ రికార్డుల ఆన్‌లైన్, కాలువల్లో పూడికలు తీయడం, శ్మశాన వాటిక స్థలాల మంజూరుచేయడం వంటి అంశాలుంటాయన్నారు. తాగునీరు క్లోరినేషన్ ప్రక్రియ అన్ని గ్రామాల్లో ఒక డ్రైవ్‌లా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం జిల్లాలో పంచాయతీలు, విద్యా, వైద్యం, ఆరోగ్యం, మత్స్యశాఖ, రోడ్డు భవనాలు, దివ్యాంగులు, విద్యుత్, వ్యవసాయం, జీజీహెచ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, మైనింగ్, ఏపీఎస్ ఆర్టీసీ, హౌసింగ్ పంచాయతీరాజ్ శాఖల్లో నమోదైన అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై సమీక్షించారు.





గొల్లప్రోలు మండలం ఏకేమల్లవరంలో బురదమయంగా మారిన రహదారిపై వాటర్‌ట్యాంక్ పరిశీలనకు వెళుతున్న కృష్ణతేజ..
పిఠాపురం మండలం కుమారపురం కాలనీలో రోడ్లు నిర్మించాలని కృష్ణతేజను కోరుతున్న కాలనీవాసులు

పరిశీలిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ..

- గ్రామాల్లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి డైరెక్టర్ కృష్ణతేజ సుడిగాలి పర్యటన
- వివరాలు తెలుసుకునేందుకే ప్రాధాన్యం

గొల్లప్రోలు రూరల్, జూలై27: ప్రతి అంశాన్ని సునిశితంగా పరిశీలిస్తూ, అభిప్రాయాలు తెలుసుకుంటూ ఆయా పథకాల అమలుతీరు, గ్రామ సచివాలయాల పనితీరు, క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను తెలుసుకుంటూ పర్యటన సాగించారు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ మైలవరపు కృష్ణతేజ. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గం నుంచి తన పర్యటనలకు శ్రీకారం చుట్టిన కృష్ణతేజ శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి, ప్రత్తిపాడు మండలాల్లో సుడిగాలి పర్యటన జరిపారు. ఆద్యంతం పరిశీలన, తనిఖీలు చేస్తూనే వివరాలు తెలుసుకునేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. వివిధ వర్గాల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా తొలుత గొల్లప్రోలు మండలం వన్నెపూడి చేరుకున్నారు. ఇక్కడ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా తవ్విన ఫారమ్ పాండ్ (పొలంలో చెరువు), ఉద్యానవన తోటల పెంపకంలో భాగంగా పెంచిన గులాబితోటను పరిశీలించారు. ఫారమ్‌పాండ్ వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలు గురించి ఏపీవో కొండలరావు కృష్ణతేజకు వివరించారు. గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, మెరుగుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. అకాకర, దొండ తదితర పందిరి పంటలకు ఉపాధి పథకం ద్వారా సాయం అందించాలని రైతులు విజ్ఞప్తి చేశారు. చెందుర్తిలో ఉద్యానవన పంటల సాగులో భాగంగా జామతోటను పరిశీలించి రైతుతో మాట్లాడారు. చేబ్రోలులో చెత్త సంపద కేంద్రాన్ని (ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్) కృష్ణతేజ పరిశీలించారు. దీని ద్వారా ఆదాయం ఏమైనా వచ్చిందా ప్రశ్నించారు. ఎటువంటి ఆదాయం రాలేదని అధికారులు తెలిపారు. గ్రామంలో అమృత సరోవర్ చెరువును పరిశీలించారు. ఈ పథకం గురించి డ్వామా పీడీ వెంకటలక్ష్మి వివరించారు. కాగా చెరువు అభివృద్ధి చేసినా చెరువులోకి వచ్చే కాలువలు ఆక్రమణకు గురై మూసుకుపోయాయని రైతులు ఫిర్యాదు చేశారు. చేబ్రోలు హైజంక్షన్ వద్ద ఆక్రమణలు పెరిగిపోయాయని, వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, జనసేన నాయకులు కోరారు. గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరం వాటర్‌ట్యాంకు పరిశీలనకు బురదగా మారిన రోడ్డులోనే వెళ్లి ట్యాంకును పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్య సిబ్బందికి పంచాయతీల నుంచి జీతాలు చెల్లించలేకపోతున్నామని కృష్ణతేజకు చెందుర్తి సర్పంచ్ అల్లి పాప తెలిపారు. పారిశుధ్య పనులు చేసే సిబ్బందికి కేవలం రూ.6 వేలు మాత్రమే ఇస్తున్నారని, దాంతో పనులు చేసేందుకు ఎవరు ముందుకు రావడం లేదన్నారు. వారి జీతాలను జిల్లా పంచాయతీ రిసోర్సు సెంటర్, లేదా ఇతర గ్రాంటుల నుంచి చెల్లించే అవకాశం కల్పించాలని కోరారు. వన్నెపూడిలో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని అక్కడి ప్రజలు వినతిపత్రం అందజేశారు. ఉపాధి హామీ పథకంలో పుంతరోడ్లను అభివృద్ధి చేయాలని, పంటకాలువలను తవ్వించి కల్వర్టుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గొల్లప్రోలు జడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు వినతిపత్రం అందించారు. జడ్పీ సీఈవో శ్రీరామచంద్రమూర్తి, డీపీవో భారతిసౌజన్య, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, అడిషనల్ పీడీ వసంతమాధురి, జనసేన నేతలు బవిరిశెట్టి రాం బాబు, ఓదూరి నాగేశ్వరరావు, చల్లా చినబాబు, పినకా వెంకట్రావు, వన్నెపూడి, చెందుర్తి, చేబ్రోలు సర్పంచ్‌లు కందా నాగబాబు, అల్లి పాప, నాగరత్నం ఉన్నారు.



అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రాజేంద్రసింగ్

అన్ని ప్రాణులకు ప్రాణాన్ని ఇచ్చేది నీరు.. నీడనిచ్చేది చెట్టు : రాజేంద్రసింగ్

జేఎన్టీయూకే, జూలై 27: అన్ని ప్రాణులకు ప్రాణాన్ని ఇచ్చేది నీరు.. నీడనిచ్చేది చెట్టు అని వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా, రామన్ మెగసెసె అవార్డు గ్రహీత డాక్టర్ రాజేంద్రసింగ్ అన్నారు. వర్శిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో ప్రపంచ మడ అడవుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జేఎన్టీయూకే, పీడబ్ల్యూసీడీఎఫ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 'మడ అడవులు వారసత్వ సంపద పరిరక్షణ' అనే అంశంపై శనివారం యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలల విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. దీనికి పీడబ్ల్యూసీడీఎఫ్ సమన్వయకర్త పి.ఆదినారాయణ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా రాజేంద్రసింగ్, గౌరవ అతిథిగా ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, అతిథులుగా రెక్టార్ కేవీరమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, యూసీఈకే ప్రిన్సిపాల్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్, సామాజిక కార్యకర్త బొలిశెట్టి సత్యనారాయణ, పర్యావరణవేత్త రత్నం పాల్గొన్నారు. రాజేంద్రసింగ్ మాట్లాడుతూ నీర్, నారీ, నారాయణ్ అనే నినాదాన్ని ఇస్తూ నీర్ అంటే జీవితం, నారీ అంటే సృష్టికర్త, నది అనగా నాగరికత, నారాయణ్ అనగా నరుని జీవన మార్గము అని వివరించారు. ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ వారసత్వ సంపద పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కలిసికట్టుగా కృషిచేయాలన్నారు. జేఎన్టీయూకే గ్రీన్ క్యాంపస్‌గా వెలుగొందేందుకు రాజేంద్రసింగ్ నీటి రీసైక్లింగ్‌కు, నాలుగు హెరిటేజ్ వృక్షాల పరిరక్షణకు నమూనాలు ఇచ్చారన్నారని తెలిపారు. బొలిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ మడ అడవులు, హోప్‌ఐలాండ్ వల్ల కాకినాడ నగరం సంరక్షింపబడుతున్నదనే విషయాన్ని గ్రహించాలని కోరారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న సింహాచలం

ఐటీడీఏ పీవోగా సింహాచలం

బాధ్యతల స్వీకరణ... సిటిజన్ ఎంగేజ్‌మెంట్ టీములు ఏర్పాటు చేస్తానని ప్రకటన

రంపచోడవరం, జూలై 27: రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా కట్టా సింహాచలం శనివారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయన సీతపల్లి శ్రీగడి బాపనమ్మ, ఐ.పోలవరం సమీపంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని గిరిజనుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేలా సిటిజన్ ఎంగేజ్ టీములు ఏర్పాటు చేస్తానన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజన ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించే విధంగా అధికారులు, సిబ్బందితో కలిసి ముందుకు సాగుతానన్నారు. పీవోకు ఏపీవో (జి) సీహెచ్ శ్రీనివాసరావు, పరిపాలనాధికారి డీఎస్వీ రమణ స్వాగతం పలికారు. డిప్యూటీ డైరెక్టర్ కె.అలూసలా, పీహెచ్‌వో చిట్టిబాబు, ఏపీడీ జి.శ్రీనివాసరావు, ఎస్‌వో టి.మార్తమ్మ తదితరులు పీవోను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.



జగపతిబాబుకు మొక్క అందజేస్తున్న నర్సరీ రైతులు

పల్ల వెంకన్న నర్సరీలో జగపతిబాబు

కడియం, జూలై 27: తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం కడియపులంక పల్ల వెంకన్న నర్సరీని ప్రముఖ హీరో జగపతిబాబు శనివారం సందర్శించారు. ఆయనకు పల్ల వెంకన్న కుమారులు సత్తిబాబు, సుబ్రహ్మణ్యం, గణపతి, మనుమలు వెంకటేష్, వినయ్ పీస్ లిల్లీ అనే మొక్క అందజేసి స్వాగతం పలికారు. నర్సరీలో వివిధ రకాల ఫల, పుష్ప, ఆర్నమెంటల్, ఇండోర్, ఔట్‌డోర్ మొక్కలను చూసి కొన్ని రకాల మొక్కలు కొనుగోలు చేసి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జగపతిబాబు మాట్లాడుతూ పల్ల వెంకన్న నర్సరీతో తనకు ఏనాటి నుంచో అనుబంధం ఉందన్నారు. 'పెళ్ళైన కొత్తలో' చిత్రం షూటింగ్ చాలా వరకు ఈ నర్సరీలోనే జరిగిందని, పలు చిత్రాల షూటింగ్‌లకు కూడా వచ్చానని చెప్పారు.

వాడపల్లికి పోటెత్తిన భక్తులు

స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.34.79 లక్షలు

ఆత్రేయపురం, జూలై 27: కోనసీమ తిరుమల వాడపల్లికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగంలను శాస్త్రోక్తంగా నిర్వహించి శ్రీవేంకటేశ్వర స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు తీరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం తులభారాలు, కానుకులు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.34.79 లక్షలు లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. పార్కింగ్ ప్రదేశాలు బురదయమంగా మారడంతో వాహనాలు నిలిపేందుకు ఇబ్బంది అయ్యింది. దీంతో రోడ్డుపక్కనే నిలుపుదల చేశారు. ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఎక్కడికక్కడే వాహనాలు నిలిపివేయడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎస్‌ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి వచ్చి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు.

డీఎల్ఎంటీలకు ముగిసిన శిక్షణ

సామర్లకోట, జూలై 27: కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్ర ఆవరణలో 11 జిల్లాలకు చెంది డీఎల్ఎంటీలకు తొమ్మిది రోజులుగా ఇచ్చిన శిక్షణా తరగతులు శనివారం సాయంత్రం విజయవంతంగా ముగిసాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ మాట్లాడుతూ శిక్షణను క్షేత్రస్థాయిలో సద్వినియోగం చేయడం ద్వారా పేదరికం లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. శిక్షణార్థులకు సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ మాట్లాడుతూ మూడు బ్యాచ్‌లుగా వ్యవసాయ, విద్య, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖలకు చెంది 255 మంది అధికారులు 11 జిల్లాల నుంచి పాల్గొన్నారని తెలిపారు. ఫ్యాకల్టీలు శ్రీదేవి, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, ప్రసాద్, నీహారిక, ఆంజనేయులు, చక్రపాణీరావు, పద్మజ పాల్గొన్నారు.



కాటన్ బ్యారేజీ నుంచి సముద్రంలోకి ఉరకలెత్తుతూ ప్రవహిస్తున్న గోదావరి

ఉగ్ర గోదావరి

▸▸ ధవళేశ్వరం వద్ద మరలా రెండో ప్రమాద హెచ్చరిక జారీ ▸▸ 14.50 అడుగులకు చేరిన నీటిమట్టం ▸▸ 13.92 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 27: గోదావరి పరివాహక ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహానికి ఉప నదుల నుంచి వస్తున్న వరద నీరు తోడవడంతో ఉగ్రరూపం దాల్చి ంది. సీజన్లో మొదటిసారిగా భద్రాచలం వద్ద 53 అడుగులకు పైగా ప్రవహిస్తుండగా ధవళేశ్వరం వద్ద 14 అడుగులకు చేరుకుని ప్రమాదకరంగా వుంది. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం తెల్లవారుజాము వరకు స్వల్పంగా తగ్గిన నీటిమట్టం 13.40 అడుగులకు చేరుకుంది. అటుపై ఎగువ నుంచి వచ్చే వరద నీటితో నీటిమట్టం పెరగడం ప్రారంభించి మధ్యాహ్నం 3 గంటలకు 13.75 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈ సమయంలో కాటన్ బ్యారేజీ నుంచి 13లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు ప్రవహిస్తోంది. ఆపై నీటిమట్టం మరింత పెరుగుతూ రాత్రి 7 గంటలకు 14 అడుగులకు చేరుకోగా 13,20,274 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 15 అడుగులకు పైగా పెరిగి ఆపై తగ్గవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా ఎగువున భద్రాచలం వద్ద క్రమంగా పెరిగిన నీటిమట్టం ప్రమాదకర స్థాయి 53 అడుగులు దాటి రాత్రి ఏడు గంటలకు 53.60 అడుగులకు చేరింది. తాలిపేరు ప్రాజెక్టు నుంచి 1.20లక్షలకు పైగా నీటిని విడుదల చేస్తుండడంతో ఆ ప్రభావంతో భద్రాచలం వద్ద ప్రస్తుతం నీటిమట్టం పెరుగుతోంది.

ఎగువ నీటి మట్టాలు

శనివారం సాయంత్రానికి ఎగువున కాళేశ్వరం వద్ద 9.47 మీటర్లు, పేరూరు వద్ద 16.80 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 14.59 మీటర్లు, భద్రాచలం వద్ద 53.40 అడుగులు, కూనవరం వద్ద 21.48 మీటర్లు, కుంట వద్ద 13.15 మీటర్లు, పోలవరం వద్ద 13.26 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.08 మీటర్లుగా నీటిమట్టం నమోదైంది.

ధవళేశ్వరం వద్ద గోదావరికి శనివారం మధ్యాహ్నం 3గంటలకు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. నీటిమట్టం రాత్రి 12 గంటలకు 14.50 అడుగులకు చేరడంతో ఫ్లడ్ కన్జర్వేటర్ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు ప్రమాద హెచ్చరిక జారీచేస్తూ ఫ్లడ్ సెక్షన్ అధికారులు వారికి కేటాయించిన ఏటిగట్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈఈలు, డీఈలు, ఏఈలు, ఫ్లడ్ సూపరింటెండెంట్, ఫ్లడ్ సెక్షన్ ఆఫీసర్లుగా విధులు చేపట్టారు. బలహీన ఏటిగట్ల వద్ద, అవుట్‌ఫాల్ స్లూయిస్ వద్ద అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టారు.

ఎటుచూసినా వరద నీరే

గంటగంటకూ పెరుగుతున్న శబరి... ఉధృతంగా ప్రవహిస్తున్న సీలేరు.... ఎగువ పోటునిచ్చిన గోదావరి

చింతూరు, జూలై 27: ఎటు చూసినా వరద నీరే కనిపిస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు, కూనవరం, వర రామచంద్రపురం, ఎటపాక మండలాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. శనివారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి వరద 53.3 అడుగులకు చేరింది. చింతూరు వద్ద శబరి నీటిమట్టం 42 అడుగులుగా నమోదైంది. డొంకరాయి రిజర్వాయరు నుంచి నాలుగు గేట్ల ద్వారా 13,124 క్యూసెక్కుల నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. దీంతో సీలేరు నది ఉధృతమైంది. మొత్తం మీద విలీన మండలాల్లో వరద గంటగంటకూ పెరుగుతోంది. పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించి ఇప్పటికే వారం దాటింది. లోతట్టు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వరద ఉధృతితో ముంపు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వరద పెరుగుతున్నందున లోతట్టు వాసులందరూ సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిందిగా అధికారులు హెచ్చరిక జారీ చేశారు. దీంతో వారంతా సామగ్రి సర్దుకుని పరుగులు తీస్తున్నారు. గుట్టలు, మెట్టల్లో టార్పాలిన్లతో కూడిన పాకలు వేసుకుని తల దాచుకుంటున్నారు. చింతూరు మీదుగా విజయవాడ వెళ్లే 30వ నెంబరు జాతీయ రహదారితో పాటు ఒడిసా వెళ్లే 326వ నెంబరు జాతీయ నెంబరు రహదారి కూడా జలదిగ్బంధమైంది. దీంతో తెలంగాణ, ఒడిసా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చింతూరు మీదుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గ్రామాల్లో వరద నీరు భారీగా చేరడంతో గ్రామాల్లో నాటు పడవలపై ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. చింతూరు, కూనవరం, వర రామచంద్రపురం మండల కేంద్రాల్లోకి వరద నీరు చేరింది.



వీఆర్ పురం మండలం చింతరేగుపల్లి గ్రామాన్ని ముంచెత్తిన వరద నీరు

రేపు కాకినాడలో జాబ్ మేళా

కాకినాడ సిటీ, జూలై 27:

కాకినాడలో వికాస ఆధ్వర్యంలో ఈ నెల 29న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ముత్తూట్ ఫిన్‌కాప్ లిమిటెడ్ కంపెనీలో సర్వీస్ ఎగ్జిక్యూటివ్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, అరబిందో ఫార్మాలో టెక్నీషియన్, కెమిస్ట్, రాక్‌మెన్ ఇండస్ట్రీస్, డిక్సాన్, హోండాయ్ మోబీస్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ బయోటెక్నాలజీ, ఎమ్మెస్సీ మెక్రో బయాలజీ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటా యన్నారు. ఆసక్తి గల వారు సోమవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయానికి సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76111 నెంబరును సంప్రదించాలని లచ్చారావు కోరారు.



భువనేశ్వరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు

మహిళపై హత్యాయత్నం చేసిన వ్యక్తి అరెస్టు

గొల్లప్రోలు, జూలై 27:

కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలో మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. సరిహద్దు గోడ విషయంలో తగాదాలతో పట్టణంలోని రంగప్పచెరువు వీధికి చెందిన నేకూరి రాజ్యలక్ష్మిపై అదే ప్రాంతానికి చెందిన వేమగిరి రాజేష్ గొడ్డలితో విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు రాజేష్‌ను అరెస్టు చేసి దాడికి ఉపయోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. రాజేష్‌ను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ జాన్‌బాషా తెలిపారు.

భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా....

రాజమహేంద్రవరం సిటీ, జూలై 27: రాజమహేంద్రవరం షెల్టాన్ హోటల్ అధినేత సుధాకర్ శనివారం ఏర్పాటుచేసిన ఒక ప్రత్యేక కార్యక్రమానికి సీఎం నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి హాజరయ్యారు. ఆమెను రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, ఆయన అల్లుడు అన్నె రామకృష్ణ, కుమార్తె అన్నె స్మిత, పలువురు టీడీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి ఆప్యాయంగా పలకరించారు.



12 గంటల్లో పట్టేశారు

రూ.2కోట్లు కొట్టేయడానికి యత్నించిన ఉద్యోగిని అరెస్టు చేసిన పోలీసులు

రాజమహేంద్రవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంల్లో ఉంచాల్సిన డబ్బులతో ఉడాయించాలనుకున్న ఉద్యోగి ఆటకట్టించిన పోలీసులు 12 గంటల్లోనే కటకటాల్లోకి నెట్టారు. దీనికి సంబంధించి శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.... డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం మాచరమట్లకు చెందిన వాసంశెట్టి అశోక్‌కుమార్ బ్యాంకు ఏటీఎంల్లో డబ్బులు నింపే హిటాచి క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌లో 2018 నుంచి నెలకు రూ.11వేల జీతానికి సార్టర్ అసిస్టెంట్‌గా పొరుగు సేవల విధానంలో పనిచేస్తున్నాడు. ఈ సంస్థ హెడీఎఫ్‌సీ ఏటీఎంల్లో డబ్బులు నింపుతుంది. ఈ నెల 26వ తేదీ (శుక్రవారం) మధ్యాహ్నం సమయంలో ఏటీఎంల్లో పెట్టేందుకు బ్యాంకు నుంచి రూ.3,32,50,000 తీసుకున్నాడు. రూ.1.12 కోట్లను మరో ఉద్యోగి హరీశ్‌గౌడ్, ఆదిత్య, రూట్ ఆఫీసర్ దొంతల సునీల్‌కుమార్ (ఫిర్యాది)లకు ఇచ్చాడు. మిగతా రూ.2,20,50,000 వారం క్రితం వేసుకున్న పథకం ప్రకారం తాను అద్దెకు తెచ్చుకున్న కారులో పెట్టుకుని ఉడాయించాడు. దీనిపై మధ్యాహ్నం 3 గంటల సమయంలో పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఐదు పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు మొదలుపెట్టారు. ఈ క్రమంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా రాజానగరం మండలం చక్రద్వారబంధం సమీపంలో అనుమానాస్పదంగా వ్యవహరించిన వ్యక్తిని ఆపి తనిఖీ చేశారు. కారులో రూ.లక్ష ఉండగా సదరు వ్యక్తిని నిందితుడు అశోక్‌కుమార్‌గా గుర్తించారు. అదే గ్రామంలో అద్దెకు తీసుకున్న రాఖీ అవెన్యూస్ అపార్ట్‌మెంట్‌లోని గంగా బ్లాక్ ఫ్లాట్ నెం.104లో దోపిడీ డబ్బును దాచి... లక్ష మాత్రం తీసుకుని కొంతకాలం కనిపించకుండా ఉందామని అశోక్ చెప్పాడు. ఫ్లాట్‌లో దాచిన రూ.2,19,50,000 స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు చెడు వ్యసనాలకు, విలాస జీవనానికి అలవాటుపడి ఈ నేరానికి పాల్పడినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. ఉన్నతాధికారుల సూచనలతో సాంకేతికత సహాయంతో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ అనుసరించి నిందితుడిని కేవలం 12గంటల్లో అరెస్టు చేశారు. కేసు ఛేదించడంలో ప్రతిభ చూపిన డీఎస్పీ విజయపాల్, త్రీటౌన్ (వన్‌టౌన్ ఇన్చార్జి) సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్



నాలుగు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

డొంకరాయి జలాశయానికి భారీగా వరద నీరు

మోతుగూడెం, జూలై 27: భారీగా కురుస్తున్న వర్షాలకు డొంకరాయి జలాశయానికి వాగుల నుంచి వచ్చే ఇన్‌ఫ్లోస్ పెరిగాయి. ఈ నేపథ్యంలో శనివారం నీటి విడుదలను 10,936 క్యూసెక్కులకు పెంచామని జెన్‌కో అధికారులు పేర్కొన్నారు. డొంకరాయి జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు. ఈ నెల 24 వరకు కురిసిన వర్షాలకు 1035.5 అడుగులకు చేరుకోవడంతో అధికారులు అప్రమత్తమై నీటి నిల్వలు ప్రమాద స్థాయికి చేరకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. జలాశయం నుంచి రెండు గేట్లు ఎత్తి 2,173 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అయితే 26వ తేదీ నాటికి ఇక్కడ వరదనీరు మరింత చేరడంతో శుక్రవారం అర్ధరాత్రి 3వ గేటు (6వ నెంబరు గేటు) రెండు అడుగులు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా శనివారం ఉదయం నాటి జలాశయంలోకి ఇంకా ఇన్‌ఫ్లోస్ పెరుగుతున్న నేపథ్యంలో 4వ గేటు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసి నీటిమట్టం 1036 అడుగుల వద్ద నీటి మట్టం స్థిరంగా కొనసాగేలా జెన్‌కో అధికారులు చర్యలు చేపడుతున్నారు. సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు శనివారం జలాశయం వద్దకు చేరుకుని ఇన్‌ఫ్లోస్, దిగువకు నీటిని విడుదల చేస్తున్న వివరాలను ఈఈ విజయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. జలాశయానికి వరద తాకిడి తగ్గేంత వరకు సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, ఇంజనీర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నీటి విడుదల, ఇన్‌ఫ్లోస్ సమాచారాన్ని అధికారులకు చెప్పాలని సూచించారు. ఈఈ బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్లు శ్రీనివాసరావు, చింతపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. డొంకరాయిలోని ఏపీపీ డ్యామ్ కూడా వరద తాకిడి అధికం కావడంతో శనివారం రెండు గేట్లు ఎత్తి రెండు వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.



ఎటపాక-చెన్నంపేట గ్రామాల మధ్యలో రహదారిపై చేరిన వరద నీరు

గిరిజన గ్రామాలను ముంచెత్తిన వరద నీరు

ఎటపాక, జూలై 27: మండలంలోని గన్నవరం, గొల్లగూడెం, నందిగామ, ఎర్రగట్టు గ్రామాలను వరద నీరు చుట్టుముట్టింది. ఇళ్ల ఆవరణల్లోకి నీరు చేరడంతో బాధిత ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలివెళ్లారు. భద్రాచలం-కూనవరం ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరడంతో గత మూడు రోజులుగా ఈవైపు రాకపోకలు స్తంభించాయి. మురుమూరు, నందిగామ, గన్నవరం, నెల్లిపాక, రాయనపేట, గౌరిదేవిపేట, చోడవరం ఎటపాక ప్రధాన రహదారిను వరద నీరు ముంచెత్తింది. శనివారం ఉదయం భద్రాచలం- కూనవరంతో పాటు ఎటపాక-తెలంగాణ వైపుగా రాకపోకలు నిలిచాయి. విస్సాపురం పంచాయతీలోని ఎర్రగట్టు గిరిజన గ్రామంలో బోటుకు డిజిల్ ఏర్పాటు చేయకపోవడంతో గ్రామ సెక్రటరీ, ప్రజాప్రతినిధులు నడుము లోతు వరద నీటిలో వెళ్లి బాధితులకు కూరగాయలు అందించారు. విజయవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శనివారం ఉదయం వరద ప్రవాహంలో ప్రమాద అంచున భద్రాచలం వైపు వెళ్లింది. అందులోని ప్రయాణికులు ఒకింత భయాందోళన చెందారు.





రాయనపేట వద్ద వరద నీటిలో ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు, ఎర్రగట్టులో వరద నీటిలో నిత్యావసరాలు తీసుకెళ్తున్న సెక్రటరీ, ప్రజాప్రతినిధి

శృంగార వల్లభస్వామి ఒక్కరోజు ఆదాయం రూ.2.38 లక్షలు

పెద్దాపురం, జూలై 27: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. సుమారు ఐదు వేల స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,56,590 అన్నదాన విరాళాలు రూ.48,281, కేశఖండన ద్వారా రూ.4,080, తులాభారం రూ.300, లడ్డూ ప్రసాదం ద్వారా 18,690, నామకరణం ద్వారా రూ.200... మొత్తం రూ.2,38,141 ఆదాయం సమకూరినట్టు ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. దేవస్థానం అర్చకుడు పెద్దింటి నారాయణాచార్యులు పాల్గొన్నారు.

నవోదయలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెద్దాపురం, జూలై 27: జవహర్ నవోదయ విద్యాలయలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య తెలిపారు. సెప్టెంబరు 16వ తేదీలోగా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందినవారై, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి అంతరాయం లేకుండా చదువుతూ ఉండాలన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 45 కేంద్రాల్లో వచ్చే సంవత్సరం జనవరి 18న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. navodaya.gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు పొందవచ్చని ప్రిన్సిపాల్ చెప్పారు.

కాకినాడ

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రత్తిపాడు, జూలై 27: ప్రత్తిపాడు లయన్స్ కమ్యూనిటీ హాల్లో సోమవారం నియోజకవర్గస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. జేసీ రామ్‌సుందర్‌రెడ్డి పాల్గొనే ఈ వేదికలో నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల ప్రజలు ఫిర్యాదులు అందజేయవచ్చని స్థానిక రెవెన్యూ అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచే పరిష్కార వేదిక ప్రారంభమవుతుందని చెప్పారు.

‘వృక్ష సంపదతోనే మానవాళి మనుగడ సాధ్యం’

జీజీహెచ్ (కాకినాడ) జూలై 27 వృక్ష సంపద ఆధారంగానే భవిష్యత్తులో మనవాళి మనుగడ సాధ్యమని కాకినాడ రంగరాయ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డా.ఏ. విష్ణువర్ధన్, డా.దేవీ మాధవి అభిప్రాయపడ్డారు. వన్‌స్టెప్ టూవార్డ్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్ఎంసీ ప్రాంగణంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డా.విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డా.డిఎస్‌విఎల్ నరసింహం ఆదేశానుసారం కళాశాల ప్రాంగణంలో పచ్చదనం పెంపొందించి ఆక్సిజన్‌ను విడుదల చేసే మొక్కలను పెద్ద ఎత్తున నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు నడుంకట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫోరెన్సిక్ హెచ్‌వోడి డా.ఉమమహేశ్వరరావు, డా.మైధిలీ, డా.శైలజా, డా.సత్యవాణి, డా. రాజ్యలక్ష్మి, డా.కళ్యాణ్, డా.ఉమా, డా.ప్రసన్న అనుసూయ, డా.భాగ్యలక్ష్మి, డా.పర్విన్, డా.సతీష్, డా.ఆదిత్య, డా.లలిత, డా.నజీయా తదితరులు ఉన్నారు.

‘ఆధ్యాత్మిక కేంద్రంగా శ్రీరామ క్షేత్రం’

ప్రత్తిపాడు, జూలై 27: ప్రత్తిపాడులోని నరేంద్రగిరి కొండ వద్ద గల శ్రీరామనామ క్షేత్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్టు శ్రీమద్ రామాయణ పీఠం అధ్యక్షుడు గళ్లా సుబ్బారావు చెప్పారు. నరేంద్రగిరి కొండపై గల శ్రీరామనామ క్షేత్రంతో పాటు నూతనంగా నిర్మించే రామాలయ నిర్మాణ పనులను శనివారం సుబ్బారావు, కమిటీ సభ్యులతో కలిసి సందర్శించారు. నరేంద్రగిరి కొండపై ఆంధ్రా భద్రాద్రి పేరుతో రూ.4కోట్లతో రామలయ నిర్మాణంతో పాటు 50అడుగుల శ్రీరాముని విగ్రహంతో పాటు పలు ఉప ఆలయాలు నిర్మించనున్నట్టు తెలిపారు. ఆలయ అభివృద్ధికి అద్దె ఆదినారాయణమ్మ, రెడ్నం శ్రీవల్లి అధ్యక్ష కార్యదర్శులతో కూడిన మహిళా కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గోగుల వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షులు చలంకూరి భాను, శ్రీరామక్షేత్రం అధ్యక్షులు రెడ్నం రాజా, పుష్పారెడ్డి, పుప్పాల రమణ, కమిటీ సభ్యులు జువ్వల చినబాబు, కొల్లు రాంబాబు, పత్రి రమణ, మదినే నూకరాజు, గానాల గంగాధర్, సిరిపురం కార్యదర్శి రామరాజు వర్మ ఉన్నారు.

‘ప్రజాప్రతినిధులు సుపరిపాలన అందించాలి’

పోర్టు సిటీ (కాకినాడ), జూలై 27: ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులు సుపరిపాలన అందించాలని కోరుతూ సదస్సు జరిగింది. శనివారం సాయంత్రం స్థానిక వెంకటరత్నపురంలోని గాంధీభవన్‌లో యూనివర్శిటీ ఆఫ్ డెమోక్రసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు పలు విభాగాలకు చెందిన మేధావి వర్గం ప్రతినిధులు హాజరయ్యారు. ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు ప్రొఫెసర్ జి.అబ్బయ్య, డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మంచి పరిపాలన జరిగేందుకు ప్రజాప్రతినిధులు అంతా సంఘటితంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు పాలనపై అవగాహన కల్పించాల్సిన ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు ఫౌండేషన్ రూపొందించిన యాప్‌ను ఆవిష్కరించారు. బ్రోచర్‌లను విడుదల చేశారు. కార్యక్రమలో డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, డాక్టర్ కాదా వెంకటరమణ, వైఎస్‌వీఎస్ మూర్తి, డాక్టర్ కె.బాబ్జి, శ్యామ్, సయ్యద్ సలార్‌తో పాటు గాంధీభవన్, సత్య చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

‘పరికరాలు వినియోగంలోకి తీసుకురావాలి’

పిఠాపురం, జూలై 27: పట్టణంలోని చిన్నమాంబా, ఆర్‌ఆర్ పార్కుల్లో ఉన్న వ్యాయామ పరికరాలను తక్షణం వినియోగంలోకి తీసుకురావాలని టీడీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పార్కుల్లో వ్యాయామ పరికరాలకు సంబంధించినట్టు కొన్ని నట్లు, బోల్టులు, ఇతర సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని వారు తెలిపారు. వారిని గుర్తించి చర్యలు తీసుకోవడంతో పాటు తక్షణం మరమ్మతులు నిర్వహించాలని, పిల్లలు కోసం జారుడుబల్లలు, ఉయ్యాల వద్ద ఇసుక ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ ఫ్లోర్‌లీడర్ అల్లవరపు నగేష్, కౌన్సిలరు రాయుడు శ్రీను, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు నల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత’

పెద్దాపురం, జూలై 27: పర్యావరణ పరిరక్షణ సమాజంలో ప్రతీ ఒక్కరి బాధ్యత అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల పద్మజ, బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. తల్లి పేరుతో మొక్క కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద మొక్కలు నాటే కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రోజురోజుకూ పెరిగిపోతున్న వాతావరణంలో కాలుష్యాన్ని తగ్గించే ఉద్దేశ్యంతో తమవంతు బాధ్యతగా మొక్కలు నాటుతున్నట్టు పేర్కొన్నారు. ప్రతీఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దుర్గామోహన్‌రావు, రవికృష్ణ, ప్రసాద్, శ్రీరాములు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

‘మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ’

ప్రత్తిపాడు, జూలై 27: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఎంఈవో వి.రాజబాబు చెప్పారు. మండలంలోని పొదురుపాక పాఠశాల వద్ద శనివారం ఆయన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మొక్కల పెంపకం ద్వారా వాతావరణ సమతుల్యత నెలకొంటుందని సకాలంలో వర్షాలు కురవడానికి ఎంతోదోహదపడుతుందన్నారు. ప్రధానోపాధ్యాయులు సీహెచ్ ముత్యాలమ్మ, సీఆర్ఎంపీ రాంజీ ప్రసాద్, ఉపాధ్యాయులు నూకరాజు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫామ్ తోట విస్తరణ మహోత్సవం

గండేపల్లి, జూలై 27: మండలంలోని తాళ్ళూరులో శనివారం ఆయిల్‌ఫామ్ తోట విస్తరణ మహోత్సవం నిర్వహించారు. డీజీఎం ఏఎస్ ప్రకాశ్ హాజరై ఆయిల్‌ఫామ్ పంట ప్రాముఖ్యత, ప్రత్యేకతలు వివరించారు. మండలంలో 5334 హెక్టార్ల విస్తీర్ణంలో ఆయిల్‌ఫామ్ సాగుచేస్తున్నారని వివరించారు. ఆయిల్‌ఫామ్ సాగుకు అవసరమైన ఎరువులు, అంతర పంటలు బిందు సేద్యం సంబంధిత పని ముట్లు విషయంలో ప్రభుత్వం ద్వారా ప్రోత్సాహకాలు, రాయితీలు తెలిపారు. కార్యక్రమంలో పతంజలి కంపెనీ సిబ్బంది ఎస్.వీర్రాజు, జి.దుర్గాప్రసాద్, గణేష్, మణికుమార్, ప్రసాద్, కొండలరావు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పృధ్వి, హరిష, భాగ్యరేఖ, సురేఖ, రైతులున్నారు.

ఐటీఐల్లో రెండో విడత కౌన్సిలింగ్

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 27: కాకినాడ ప్రభుత్వ ఉపాధి శిక్షణ శాఖ సంస్థ(ఐటీఐ)లో రెండోవిడత కౌన్సిలింగ్ శనివారం నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి గాను ఐటీఐల్లో రెండోవిడత ప్రవేశం కొరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కౌన్సిలింగ్‌కు హాజరయ్యారు. అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎం.వేనుగోపాలవర్మ, ఇతర సిబ్బంది వెరిఫికేషన్ చేశారు. మెరిట్ నెంబర్ జీపీఏ 1 నుంచి 994 వరకు కౌన్సిలింగ్ నిర్వహించారు. వివిధ ట్రేడుల్లో 135 సీట్లకు గాను రెండోదశ కౌన్సిలింగ్‌కి 994 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.

ముగిసిన నైపుణ్యాభివృద్ధి సదస్సు

గండేపల్లి, జూలై 27: సూరంపాలెంలోని ఆదిత్య విద్యాసంస్థల్లో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో 5రోజుల పాటు ఇండియన్ కాంక్రీట్ ఇన్‌స్టిట్యూట్‌తో కలిసి నిర్వహించిన నైపుణ్యాభివృద్ధి సదస్సు శనివారంతో ముగిసింది. డాక్టర్ జ్ఞానానందరావు నేతృత్వంలో డాక్టర్ నాగదీరాజ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ అజయ్‌కుమార్, సరస్వతి, జార్జ్‌ఫెర్నాండజ్ శిక్షణా తరగతులు నిర్వహించినట్టు ఆదిత్య ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. సాంకేతిక సిబ్బంది పాల్గొనగా తరగతులకు హాజరైన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

ఆకట్టుకున్న సంగీత కచేరి

సర్పవరం జంక్షన్, జూలై 27: సర్పవరంలో శ్రీ భవానీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వాగ్గేయకార మండపంలో శనివారం సాయంత్రం ప్రముఖ సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి ఆధ్వర్యంలో అమెరికాకు చెందిన అద్దంకి సిస్టర్స్ నికిత, ఇషితలు నిర్వహించిన సంగీత కచేరి సంగీత ప్రియులను ఎంతో ఆకట్టుకుంది. అద్దంకి సిస్టర్స్ గాత్రం ఆలపించగా, వయోలిన్ మహేంద్రవాడ నరసింహమూర్తి అందించారు. మృదంగం వారణాసి శ్రీనివాస్, ఘటం ఏ అనిల్‌కుమార్‌లు సహకారం అందించారు. కార్యక్రమంలో సంగీత విద్య సభ అధ్యక్షులు మునిగంటి వెంకట్రావు, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తంటికొండలో పర్యటించిన తుమ్మలపల్లి రమేష్

జగ్గంపేట, జూలై 27: తంటికొండ గ్రామంలో జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పర్యటించి జనసేన క్రియాశీలక సభ్యత్వంపై వలంటీర్లకు సూచనలు చేశారు. మరో 2రోజుల్లో క్రియాశీలకసభ్యత్వం కార్యక్రమం ముగుస్తుందని, జగ్గంపేట నియోజకవర్గంలో అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయాలన్నారు. ఏమైనా ఇబ్బంది ఉంటే టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని చర్యలు తీసుకుంటామన్నారు. రాజపూడిలో శుక్రవారం రాత్రి జనసైనికుడు చిదిరిశివదుర్గ ఇంట్లో దొంగలు పడి 10కాసుల బంగారు, రూ.3లక్షల నగదు దొంగలించడంతో తుమ్మలపల్లి రమేష్ శివదుర్గని పరామర్శించి సీఐ, ఎస్ఐలతో మాట్లాడి త్వరగా దొంగల్ని పట్టుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ సర్పంచ్ మృతి



పూర్ణిమ (ఫైల్)

సామర్లకోట, జూలై 27: మండలంలో వెంకటకృష్ణరాయపురం గ్రామ సర్పంచ్ మోర్త పూర్ణిమ కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందారు. ఈనెల 25న తుని సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో తాను ప్రయాణిస్తున్న మోటార్‌సైకిల్ నుంచి రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయాలయ్యి తీవ్రంగా రక్తస్రావమైంది. ఆమెను చికిత్స నిమిత్తం పనసపాడులోని ఒక కార్పొరేట్ ఆ సుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నప్పటికీ వైద్యుల కృషి ఫలించలేదు. దీంతో శనివారం రాత్రి సర్పంచ్ పూర్ణిమ మృతి చెందినట్టు నిర్ధారించారు. కాగా సర్పంచ్ పూర్ణిమ మృతి పట్ల వెంకటకృష్ణరాయపురం పంచాయతీ కార్యదర్శి శ్రీహరి, పలు రాజకీయ పార్టీల నాయకులు, పంచాయతీ సిబ్బంది తీవ్ర సంతాపం తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి


పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, జూలై 27: పర్యావరణ పరిరక్షణకు అందరూ మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. సామర్లకోట మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు ఆధ్వర్యంలో స్వచ్ఛతా వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, బీజేపీ ఇన్‌చార్జి విత్తనాల వెంకటరమణ హాజరయ్యారు. పెద్దాపురం రోడ్డులో డివైడర్ల వెంట మొక్కలను వారు నాటి నీరు పోశారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గల కాపు కల్యాణ మండపం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్లు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, మున్సిపల్ చైర్‌పర్సన్ జి.అరుణ పాల్గొన్నారు.రాష్ట్రంలో విద్యారంగానికి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అధిక ప్రాధాన్యమిచ్చి ఉన్నత ఉద్యోగావకాశాలకు ప్రోత్సహించిందని ఎమ్మెల్యే చినరాజప్ప అన్నారు. సామర్లకోట ప్రభుత్వ కళాశాల ఆవరణలో మండలస్థాయి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్టూడెంట్ కిట్ల పంపిణీ ఎంఈవో పి.పుల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, బీజేపీ ఇన్‌చార్జి వెంకటరమణ పాల్గొన్నారు. అచ్చుపుస్తకాలు, నోట్స్ పుస్తకాలు, బ్యాగ్‌లు, షూలు, యూనిఫాం తదితర విద్యా సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, పాల్గొన్నారు.



సామర్లకోటలో మొక్కలు నాటిన రాజప్ప, తుమ్మల

మంత్రి లోకేశ్‌కు అభినందన



లోకేశ్‌ను అభినందిస్తున్న రాజప్ప, నున్న రామకృష్ణ

కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న ఆశలు ఒమ్ముచేయని రీతిలో సుపరిపాలన అందించేందుకు విశేష కృషిచేస్తున్న మంత్రి నారా లోకేశ్‌ను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అభినందించారు. శనివారం అమరావతిలో లోకేశ్‌ను రాజప్ప, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నున్న రామకృష్ణ అభినందించారు. జిల్లాలో రైస్‌మిల్ పరిశ్రమకు పూర్వవైభవం తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేసి ఆదుకోవాలని రామకృష్ణ లోకేశ్‌ను కోరారు.

సాంకేతిక విజ్ఞానాన్ని పెంచుకోవాలి

పెద్దాపురం, జూలై 27: విద్యార్థులు సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక రామారావుపేటలో అల్లంరాజు ఛారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో క్రియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏసీటీ సైన్స్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఎంతమంది విద్యార్థులు ప్రయోగాలు నేర్చుకోవడానికి వచ్చారో నిర్వాహకుడు బుద్దా శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. సెలవురోజుల్లో విద్యార్థులకు ప్రయోగాలు నేర్పించడం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజాసూరిబాబురాజు, చీఫ్ ఆడిటింగ్ ఆఫీసర్ మధునాపంతుల కిరణ్, జగన్నాథం, చలపతి, తూతిక రాజు, నాగు తదితరులు ఉన్నారు.

ప్రతీ ఫిర్యాదుకు పరిష్కారం

కాకినాడ కమిషనర్ భావన



అధికారులతో సమావేశమైన కమిషనర్ భావన

కార్పొరేషన్(కాకినాడ), జూలై 27: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, డయల్ యువర్ కమిషనర్ ద్వారా వచ్చిన ప్రతీ ఫిర్యాదుకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని కాకినాడ నగరపాలకసంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార ప్రగతిపై శనివారం అన్ని విభాగాధిపతులతో కమిషనర్ సమావేశమయ్యారు. ఇప్పటి వరకు వచ్చిన ఫిర్యాదులు ఎన్ని? ఎన్ని పరిష్కారమయ్యాయి? ఇంకా ఎన్ని పరిష్కరించాల్సి ఉంది? పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు కారణాలు ఏమిటి వంటి అంశాలపై ఆరా తీశారు. ముఖ్యంగా ఆయా విభాగాధిపతులు వచ్చిన ఫిర్యాదులను స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్.నాగనరసింహరావు, ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, స్మార్ట్‌సిటీ ఎస్ఈ వెంకటరావు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఏసీపీ నాగశాస్త్రులు, ఉద్యాన సహాయసంచాలకులు టీవీ శిరిల్,ఈఈ మాధవి ఉన్నారు.

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి డైరెక్టర్ పర్యటన



కొత్తపల్లి మండలం వాకతిప్పలో మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న కృష్ణతేజ

పిఠాపురం రూరల్, జూలై 27: పిఠాపురం మండలం చిత్రాడ, కుమారపురం, ఎఫ్‌కేపాలెం, కందరాడ గ్రామాల్లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి డైరెక్టర్ మైలవరపు కృష్ణతేజ శనివారం పర్యటించారు. చిత్రాడను ఓవర్‌హెడ్ రిజర్వాయర్, గ్రామ సచివాలయాన్ని, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా నిర్మించి రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్ కట్టడాన్ని పరిశీలించారు. చిత్రాడలో సర్వీసు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ సునీత, గ్రామస్తులు కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కుమారపురంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. నూతనంగా ఇచ్చిన పట్టాలు ప్రాంతంలో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని కాలనీ వాసులు కృష్ణతేజను కోరారు. ఎఫ్‌కేపాలెం, కుమారపురం, కందరాడల్లో గ్రామ సచివాలయాలను ఆయన సందర్శించారు. సచివాలయాల పనితీరు, ఉన్న సిబ్బంది, వారికి అప్పగించిన బాధ్యతలు తదితర అంశాలు డీఎల్‌డీవో నారాయణమూర్తి వివరించారు. ఆయన వెంట సివిల్ సప్లైస్ డీఎం బాల సరస్వతి, ఎంపీడీవో చిన్నారావు, పంచాయతీరాజ్ డీఈఈ వెంకటేశ్వరరావు, ఏఈ నూకరాజు, జనసేన నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

కొత్తపల్లి: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి డైరెక్టర్ మైలవరపు కృష్ణతేజ కొత్తపల్లి మండలం వాకతిప్పలో నాగులాపల్లి ఏరియా సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్ని అధికారులతో కలసి పరిశీలించారు. తాగునీటి పథకం ద్వారా సరఫరా అవుతోన్న గ్రామాలు, పథకం నిర్వహణపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అడిగి తెలుసుకుని మెరుగైన నిర్వహణపై అధికారులకు తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, బీజేపీ నాయకులు వాసంశెట్టి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు గుండా అప్పారావు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి డైరెక్టర్ మైలవరపు కృష్ణతేజకు ప్రత్తిపాడు మండలంలోని ధర్మవరం గ్రామ పంచాయతీ సమస్యలు పలువురు వివరించారు. ధర్మవరం సమీపంలోని వన్నెపూడికి విచ్చేసిన కృష్ణతేజను ధర్మవరానికి చెందిన బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఊటా వీరబాబు, రామకుర్తి సూర్యనారాయణ గ్రామంలో డ్రైన్‌లు, రహదారులు, విద్యుత్ వైర్లు, స్తంభాలు వంటివి ఏర్పాటు చేయక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

చిరుధాన్యాల సాగుతో లాభాలు



చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శంఖవరం, జూలై 27 చిరుధాన్యాల సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ డైరక్టర్ ఎజియార్ సూచించారు. పెదమాల్లాపురం గ్రామంలో చిరుధాన్యాల సాగు రిసోర్స్‌పర్సన్ దేవుళ్ల అధ్యక్షతన రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాల పంటలైన రాగి, జొన్న, కొర్ర, సామలతో పౌష్టికాహారంతో పాటు రైతులకు మంచి ఆదాయం వస్తుందన్నారు. రైతులు తమ నేలల్లోనే చిరుధాన్యాల పంటలు సాగుచేయవచ్చునన్నారు. ఏవో పి.గాంధీ మట్లాడుతూ రైతులు సాగుచేసే పంటలకు మద్దతు ధర కల్పించడం జరుగుతుందన్నారు. రైతులకు విత్తనాలను అందజేశారు. సిబ్బంది అప్పలనాయుడు, మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలి : ఏఎస్పీ



బైక్ రైడర్స్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఏఎస్పీ

సర్పవరం జంక్షన్, జూలై 27: రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని, బైక్ వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించడంతో ప్రమాదాలు నివారణతో విలువైన ప్రాణాలు కాపాడుకోవచ్చని ఏఎస్పీ ఏంజీవీ భాస్కరరావు పిలుపునిచ్చారు. నైట్ హేక్ రైడింగ్ క్లబ్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఆర్గనైజర్లు హేమంత్ నిఖిల్, ఉదయ భరత్ ఆధ్వర్యంలో ప్రమాదాల నివారణ కోసం అచ్చంపేట సెంటర్ నుంచి వైజాగ్ వరకు 70 మంది రైడర్స్‌తో నిర్వహిస్తున్న బైక్ ర్యాలీని శనివారం అచ్చంపేట సెంటర్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు పలు మోడల్స్ బైక్స్ కొనుగోలు చేసి తగిన సేఫిటీ పద్ధతులు పాటించకపోవడంతో విలువైన ప్రాణాలు కోల్పోవడమే కాకుండా క్షతగాత్రులుగా మిగుతున్నారన్నారు. హెల్మెట్ ధారణపై ప్రజలకు అవగాహన కోసం సామాజిక సేవా భావంతో కాకినాడ నుంచి వైజాగ్ వరకు యువకులు ర్యాలీ నిర్వహించడం అభినందనీయమన్నారు. ముందస్తుగా ర్యాలీ వెంట అంబులెన్స్‌ను ఏర్పాటు చేసిన ట్రినిటీ ఆసుపత్రి అధినేత రిక్కీ గూటంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, ఎస్ఐ రత్నంక్లబ్ సభ్యులు ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన ఉండాలి

అన్నవరం, జూలై 27: రోడ్డు భద్రతపై ముఖ్యంగా విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అన్నవరం ఎస్ఐ కిషోర్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక సత్యదేవా డిగ్రీకళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడిపి ప్రమాదాల నివారణకు పాటుపడాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌లు తప్పక ధరించాలన్నారు. న్యాయవాదులు బుగతా శివ, బత్తుల రవికుమార్, రాయి శ్రీనివాస్, సోము గౌరీశంకర్ కళాశాల వైస్ ప్రిన్స్‌పాల్ కొండలరావు ఉన్నారు.

6 అంశాలపై అవగాహన కల్పించాలి

కాకినాడ రూరల్, జూలై 27: యంగ్‌మైండ్స్ రేపటి కోసం స్వచ్ఛంద సంస్థ చేడుతున్న కార్యక్రమాల్లోని 6 అంశాలపై ఉన్నత పాఠశాలల్లోని 8,9,10 తరగతుల విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆర్జేడీ జి.నాగమణి తెలిపారు. స్వచ్ఛందసంస్థ చేపడుతున్న శిక్షాసప్తాహ్ కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఆర్జేడీని కలిసి 6 అంశాలపై సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వాకాడ వెంకటరమణ వివరించారు. కరప మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని ఉపాధ్యాయులు, విద్యార్థులకు మొక్కలు, గాలి, నీటి ప్రా ముఖ్యతను వివరించినట్టు చెప్పారు. నరాల కృష్ణకుమార్, దొడ్డిపట్ల బాపిరాజు, సీఎంవో చామంతి నాగేశ్వరరావు ఉన్నారు.

‘కార్మిక హక్కుల సాధనకు ఉద్యమాలు సాగించాలి’



కార్మికోద్యమ నేత పర్సా జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, జూలై 27: కార్మికోద్యమ నేత ‘పర్సా’ స్ఫూర్తితో కార్మిక హక్కుల సాధనకై ఉద్యమాలు సాగించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక యూటీఎఫ్ హోంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికోద్యమ నేత, సీఐటీయూ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పర్సా సత్యనారాయణ శత జయంతి సభ నిర్వహించారు. సీఐటీయూ నగర కన్వీనర్ మలక వెంకటరమణ అధ్యక్ష వహించిన ఈ సభలో ముందుగా పర్సా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ 7 దశాబ్దాల పాటు కార్మికవర్గానికి సేవలందించిన పర్సా చిరస్మరణీయులన్నారు. 3దశాబ్దాల పాటు కార్మికోద్యమ నిర్మాణంలో కీలకపాత్ర పోషించారన్నారు. సీఐటీయూ అఖిలభారత ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి మాట్లాడుతూ తన యావజ్జీవితాన్ని కార్మికుల శ్రేయస్సు కోసం పర్సా అంకితం చేశారన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వ శేషబాబ్జి మాట్లాడుతూ ఆయన స్ఫూర్తితో సీఐటీయూను బలోపేతం చేసుకోవాలన్నారు. అనంతరం ఆయన జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. సభలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, వివిధ సంఘాల నేతలు పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ, ఇ.చంద్రావతి, చంద్రమళ్ల పద్మ, నర్ల ఈశ్వరి, ఎం.రవణమ్మ, చామంతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ఆశ్రమం పరిశీలన

సర్పవరం జంక్షన్, జూలై 27: కాకినాడ రూరల్ పి. వెంకటాపురంలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలయోగి బాలికల గురుకులం పాఠశాలను శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, పార్లమెంటరీ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ బృందం సభ్యులు పరిశీలించారు. నాయకులు వెంకటేష్, సలాది అనిల్‌కుమార్, బల్ల సుధాకర్, సలాది నాయుడు, వెంకట్, పళ్ల ముత్తారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూలు కిట్లు

గొల్లప్రోలు, జూలై 27: పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, డాక్టర్ ఎంవీఆర్ మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో శనివారం నిర్వహించిన కార్యక్రమాల్లో విద్యార్థులకు స్కూలు కిట్లు పంపిణీ చేశారు.

కిర్లంపూడి: మండలంలోని వీరవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులను ఎంపీపీ తోట రవి, తోట గాంధీ అందజేశారు. సర్పంచ్ అంబటి బుజ్జి, గొల్లపల్లి సూరిబాబు ఉన్నారు.

నేటి నుంచి డిపార్ట్‌మెంట్ పరీక్షలు

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 27: ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహించే డిపార్ట్‌మెంట్ పరీక్షలు 2024 ఆబ్జెక్టివ్, రాత పరీక్షలను ఆదివారం నుంచి ప్రారంభమవుతున్నాయని జిల్లా రెవెన్యూ అధికారి తిప్పే నాయక్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. కాకినాడలోని అచ్యుతాపురంలో ఉన్న ఐయాన్ డిజిటల్ జోన్ ఐడిజడ్‌లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలు ఆగస్టు 2తేదీ వరకు రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని చెప్పారు.

స్వచ్ఛతా వారోత్సవాలు



తునిలో పరిసరాలు శుభ్రం చేస్తున్న కమిషనర్

తుని రూరల్, జూలై 27: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యమని మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు స్పష్టం చేశారు. స్వచ్ఛతా వారోత్సవాల్లో భాగంగా 11,14 వార్డుల్లో స్వచ్ఛతపై అధికారులు అవగాహన కల్పించి పరిసరాలు శుభ్రపరిచారు. కార్యక్రమంలో డీఈ ప్రకాశరావు, ఏఈ ప్రసన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జీవీఆర్ శేఖర్, మెప్మా సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ: స్వచ్ఛతా వారోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం స్థానిక 36వ డివిజన్ పరిధిలోని పీఆర్ కళాశాల మల్టీ జిమ్ ప్రాంగణాన్ని కూటమి నాయకులు శుభ్రం చేశారు. ఆవరణలోని చెత్త, మట్టి గుట్టలు తొలగించారు. డివిజన్ టీడీపీ మహిళా నాయకురాలు నల్లూరి తులసి, జనసేన ఇన్‌చార్జి సుంకర సురేష్, చీకట్ల వాసు, హైమావతి, పెమ్మాడి ప్రసన్న, బళ్ల కొండబాబు, పొట్నూరి మహేష్, లోహిత్,సిద్దు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.లక్ష్మీ తులసి ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు. లక్ష్మీ తులసి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఇంటి ఆవరణలో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించడంలో భాగస్వాములు కావాలన్నారు. ఉపాధ్యాయులు వెన్నా శ్రీను, సూరన్నదొర, ఎవిచారి, జె.ఏసుబాబు, డి.శివాజి, బి.మహేష్ పాల్గొన్నారు.

‘పల్లా’ను కలిసిన మాజీ ఎమ్మెల్యే



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి దంపతులు

సర్పవరం జంక్షన్, జూలై 27: టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి దంపతులు శనివారం మంగళగిరిలో పార్టీ జాతీయ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పూలబొకేలు ఇచ్చి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కొంగోడు, గంగనాపల్లి బ్రిడ్జిలనిర్మాణాలకు నిధులు మంజూరు చేసి పనులు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వెంట సంపర ఏఎంసీ మాజీ చైర్మన్ కర్రి వెంకట్రాజు, బొజ్జ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పైప్‌లైన్ పగిలి మంచినీరు వృథా



కాకినాడ సిటీ, జూలై 27: కాకినాడ పర్లోవపేటలో రోడ్డు మధ్య భూమిలో తాగునీటి పైప్‌లైన్ పగిలి మంచినీరు నిరంతరాయంగా ఎగ జిమ్ముతోంది. పర్లోవపేట రాజీవ్ గృహకల్ప ప్లాట్ల వీధిలో ఈ తాగునీటి బ్లోఅవుట్‌ను చూడవచ్చు. దీనికి అరికట్టేందుకు పైప్‌కు రబ్బర్ ట్యూబ్ తొడిగి తా త్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. కానీ మళ్లీ మంచినీరు పైకి ఎగజిమ్ముతోంది. దీనిపై తాగునీటి సరఫరా వ్యవస్థ అధికారులు సత్వరం స్పందించి శాశ్వత పరిష్కార చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మహిళలు, బాలల రక్షణకు చట్టాలు

పిఠాపురం, జూలై 27: మహిళలు, బాలల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వారి హక్కులకు భంగం కలిగించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఐసీడీఎస్ పిఠాపురం సీడీపీవో సీహెచ్ఎస్‌కే దుర్గాదేవి తెలిపారు. మహిళలు, బాలల రక్షణచట్టం 100 రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా పోష్ యాక్టు 2013పై ప్రజలకు వివరిస్తూ శనివారం ర్యాలీ నిర్వహించారు. చట్టం అమలు కోసం అంతర్గత కమిటీల ఏర్పాటు, ఎవరెవరు సభ్యులుగా ఉంటారు తదితర అంశాలు వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగమణి, మానసాదేవి, డి.మణి, శ్రీదేవి, మహిళా శక్తి సభ్యులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలున్నారు.

చంద్రబాబు ప్రాజెక్టుకు జలకళ

ప్రత్తిపాడు, జూలై 27: మండలంలో కిత్తమూరుపేట వద్ద గల చంద్రబాబు సాగర్ ప్రాజెక్టుకు జలకళ వచ్చింది. ప్రాజెక్టులోకి పరివాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల వల్ల పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో ఈ ప్రాజెక్టుకు 5 ఏళ్ల తరువాత గణనీయంగా నీటి మట్టం పెరిగింది. ఈ ప్రాజెక్టుకు ఎడమ కాలువ నిర్మించకపోవడం, కుడి కాలువ100మీటర్ల వరకు నిర్మించి వదిలి వేయడం వల్ల ఈ ప్రాజెక్టు జలాలు 5వేల ఎకరాల ఆయకట్టు పొలాలకు నీరుందని పరిస్థితి ప్రస్తుతం ఏర్పడింది. ప్రాజెక్టులో పెద్ద ఎత్తున నీరు నిల్వ ఉన్న దృష్ట్యా ఇరిగేషన్ అధికారులు కాలువలను పూర్తిస్థాయిలో నిర్మించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

సీహెచ్‌సీని పరిశీలించిన ఎమ్మెల్యే

కాకినాడ సిటీ, జూలై 27: పెదపూడి మండలంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సందర్శించి, రోగులకు ఏవిధంగా వైద్య సదుపాయాలు కల్పించాలనే దానిపై వైద్యులకు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ మందులు కొరత ఏమైనా ఉంటే కాకినాడ డీఎంఅండ్‌హెచ్‌వోతో మాట్లాడి పూర్తిస్థాయిలో మందులు అందేలా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు,నాయకులు, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

పదోన్నతిపై బదిలీ

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 27: కాకినాడ అర్బన్ ఐసీడీఎస్ సెక్టార్‌లోని జూనియర్ అసిస్టెంట్ ఎల్.హరినారాయణ పదోన్నతిపై తాళ్లరేవు సెక్టార్‌కి బదిలీపై వెళ్లారు. ఈ మేరకు ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వైశైలజ ప్రొసీడింగ్ నెంబర్ 134/ఏ/2023(ఎస్ఏ)తో ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

30న సుబ్రహ్మణ్యేశ్వర ఉత్సవాలు

ప్రత్తిపాడు, జూలై 27: శరభవరం గ్రామంలో ఈ నెల 30న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద సంప్రదాయబద్ధంగా పాలకావేళ్ళతో గ్రామోత్సవం.. స్వామి,అమ్మవార్లకు అభిషేకాలు, హోమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

వైద్యుడు లేకుండా 104 వైద్యసేవలు

రౌతులపూడి, జూలై 27: లచ్చిరెడ్డిపాలెంలో 104లో వైద్యుడు లేకుండా వైద్యసేవలు అందించడంపై గ్రామ స్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం కేవలం ఎఎన్ఎమ్, ఎమ్‌పీహెచ్‌వో వైద్యం చేయడంపై అసహనం వ్యక్తం చేశారు.